క్లుప్తంగా

రక్షిత మహిళా సొసైటీకి అవార్డు



అచ్చంపేట రూరల్: చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 192వ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్షిత మహిళా సొసైటీ వారు రెండోసారి అవార్డును పొందారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రక్షిత మహిళా సొసైటీ తరుపున డాక్టర్ హేమలత అవార్డును అందుకున్నారు.

కొండనాగులలో వైద్య శిబిరం



బల్మూర్: మండలంలోని కొండనాగులలో సురక్ష పీపుల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చైతన్య చారిటబుల్ ట్రస్టు, బుద్ధిస్ట్ ఎడ్యుకేషనల్, సర్వీసు ట్రస్ట్ సౌజన్యంతో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 415 మందిని పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 45 మంది మధుమేహ రోగులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన ఈజీఎస్, మహిళా సంఘాలు, స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, మెప్మా రీసోర్స్‌పర్సన్‌లు తదితర శాఖల అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. నియోజకవర్గంలో మహిళల కోసం అమలవుతున్న పథకాలు, వాటి అమలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేద్దాం



కల్వకుర్తిరూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రజలకు అందాలంటే షర్మిల అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అర్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వేపూరులో పర్యటించారు. ఈ సందర్భంగా వృద్ధులు, యువకులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో షర్మిల పార్టీకి అండగా నిలవాలని కోరారు.

సభ్యత్వ నమోదు



కొల్లాపూర్: గిరిజన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం కొల్లాపూర్‌లో ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులకు సభ్యత్వాలు అందజేశారు. ఆర్డీఓ హనుమనాయక్, ఎంపీపీ బోజ్యానాయక్‌తో పాటు పలువురు గిరిజన సంఘం సభ్యత్వాలను స్వీకరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, అశోక్, నాయకులు తిరుపతినాయక్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

బిజినేపల్లి: మండలంలోని శాయిన్‌పల్లికి చెందిన చింతకాయల మహేష్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన సర్పంచ్ అవంతికపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసి శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు పెట్టాడు. ఈ మేరకు సర్పంచ్ అవంతిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు.

మహిళకు గాయాలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వస్తుండగా కుక్క వెంబడించింది. దీంతో ఆ యువకుడు బైక్ వేగం పెంచడంతో అక్కడే చౌరస్తాలో పండ్లు అమ్ముకునే ఇందిర అనే మహిళకు బైక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను స్థానిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు



కొల్లాపూర్‌లోని గాయత్రీ కళాశాలలో..



ఉప్పునుంతలలో..

- ఘనంగా పూలే జయంతి
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

నాగర్‌కర్నూల్ రూరల్: సావిత్రీబాయి పూలే జయంతిని పట్టణంలో మంగళవారం వివిధ ప్రజా సంఘాలు, కులసంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ చౌరస్తాలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దోమలపెంట(అచ్చంపేట): దోమలపెంటలోని ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిజినేపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సావిత్రీబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

అమ్రాబాద్: సావిత్రీబాయి పూలే చదువుల తల్లి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ చౌరస్తాలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: సావిత్రీబాయిపూలే జయంతిని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.



కల్వకుర్తిలో..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రీబాయ్‌పూలే జయంతిని నిర్వహించారు.

కోడేరు: మండల కేంద్రంలో బీఎస్‌పీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు.

మన్ననూర్: సావిత్రీబాయి పూలే జయంతిని స్థానిక పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద సావిత్రీబాయి పూలే విగ్రహానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

కొల్లాపూర్: పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాల, ముదిరాజ్ సంఘం భవనంలో, అంబేడ్కర్ విగ్రహం వద్ద, గిరిజన సంఘం కార్యాలయంలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా జయంతి వేడుకలు నిర్వహించారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో సావిత్రీబాయి పూలే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కోరారు. మంగళవారం రాత్రి అచ్చంపేటలో కిరాణా వర్తక సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్ది రాఘవేందర్, నాయకులు రవీందర్, విశ్వశాంతి, చంద్రశేఖర్, లక్ష్మీకాంత్, నరేష్, కాశిలింగం, సుధాకర్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



లింగాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పీఆ ర్టీయూ 2023 క్యాలెండర్‌ను మండల విద్యాధికారి చంద్రుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం శేఖర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

కోడేరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో టీపీయూఎస్ క్యాలెండర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం భాస్కర్‌శర్మ, కృష్ణయ్య ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, నిర్మల తదితరులు హాజరయ్యారు.

పీఆర్‌టీయూ..

ఉప్పునుంతల: పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఎంఈఓ రామారావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హన్మంత్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర నాయకుడు విజయకుమర్ తదితరులు ఆవిష్కరించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

తాడూరు: మండలంలోని పాపగల్‌లో ప్రభుత్వ భూమి నుంచి ఓ కంపెనీకి చెందిన వారు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా, మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గంటకుపైగా ఇరువర్గాలపై ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సర్పంచ్ సువర్ణ భర్త బచ్చిరెడ్డి, గ్రామస్తుడు భీంరెడ్డిలు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. గతంలో కంపెనీకి చెందిన వ్యక్తులు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కోసం గ్రామంలోని సర్వేనంబర్ 36లో భూమిని కొనుగోలు చేశారు. అట్టి కొనుగోలు చేసిన భూమి నుంచి నల్లమట్టిని ప్రాజెక్టుకు తరలింపులో భాగంగా గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను పూడ్చేందుకు సర్వేనంబర్ 86 ప్రభుత్వ భూమి నుంచి మట్టిని టిప్పర్ల ద్వారా తరలించడం సరికాదని అన్నారు. దీంతో కొంత సేపు వ్యవహారం గందరగోళం నెలకొంది. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి రెవెన్యూ అధికారులు ఇచ్చిన లెటర్ ప్రకారం టిప్పర్లను తాడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న బచ్చిరెడ్డి

కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం



రఘు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మనోహర్

బల్మూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ రఘు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎస్పీ మనోహర్ తెలిపారు. మంగళవారం మండలంలోని రామాజీపల్లిలో కానిస్టేబుల్ మృతుదేహానికి ఎస్పీ నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో అకాల మృత్యువాతపడడం విచారకరమని అన్నారు. తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.20వేలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ భరత్, అచ్చంపేట డీఎస్పీ కిష్టకిషోర్, సీఐ అనుదీప్, ఎస్‌ఐ శివానందంగౌడ్, ఏఆర్ హెచ్‌సీ వెంకటరమణగౌడ్, ఉప సర్పంచ్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ కోసం జీపుయాత్ర

నాగర్‌కర్నూల్ రూరల్: ఆర్టీసీ పరిరక్షణ, రవాణా రంగ కార్మికుల సంక్షేమం, తదితర అంశాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న జీపుయాత్రను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పొదిల రామయ్య పిలుపునిచ్చారు. జీపుజాత కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 3న ఖమ్మంలో ప్రారంభమైన జీపుజాత 11న సంగారెడ్డిలో ముగింపు యాత్ర జరుగుతుందని తెలిపారు. మోటార్ వాహన చట్టం 2019కి సవరణలు చేయాలని, కేరళ రాష్ట్రంలోని సవారీ యాప్ తరహా యాప్‌ను దేశవ్యాప్తంగా తీసుకురావాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, పెంచిన ఓవర్‌లోడ్ ఫెనాల్టీలను తగ్గించాలని తదితర అంశాలతో జీపుజాత కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ నాయకులు సయ్యద్, కుమార్, ఆనంద్, రాజేందర్‌రెడ్డి, నరేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిధులు మంజూరు చేయండి



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రఘుపతిపేట గ్రామస్తులు మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతాకుమారి, వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఆలయం చుట్టూ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.3లక్షలు మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పరుశరాములు, బక్కయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

వెల్దండ: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 57ఏళ్ల వయస్సు కల్గిన వారందరికీ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. విడతల వారికి పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు కార్డులను అందించడానికి ప్రభుత్వం డబ్బులు మంజూరు చేయడంతో పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 9మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బొల్లంపల్లికి చెందిన రామస్వామికి రూ.60వేలు, కొండల్ రూ.60వేలు, పల్గుతండాకు చెందిన కంస్లి రూ.26వేలు, పోషమ్మతండాకు చెందిన సుజాతకు రూ.25వేలు, వెల్దండకు చెందిన శేఖర్‌గౌడ్ రూ.24వేలు, కేస్లీతండాకు చెందిన రాజు రూ.20వేలు, చౌదర్‌పల్లికి చెందిన లక్ష్మమ్మకు రూ.15,100 చెదురుపల్లి తండాకు చెందిన రూ.24వేలు, అల్లంతోటబావితండాకు చెందిన రూ.16,250ల చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. వారందరికీ ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి బిల్లుల వసూళ్లపై ఆందోళన

ఉప్పునుంతల: మండలంలోని రాయిచేడ్‌లో మంగళవారం ప్రభుత్వం అందిస్తున్న ఆసరా ఫించన్ డబ్బులు పంపిణీ చేసే చోటనే పంచాయతీ కార్యదర్శి యాదమ్మ ఇంటి బిల్లులు వసూలు చేస్తుందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో తిరిగి ఇంటి బిల్లులు, నల్లా బిల్లులు వసూలు చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి వారానికి ఒకసారి వచ్చిపోతూ ఫించన్ డబ్బుల నుంచి ఇంటి బిల్లులు వసూలు చేస్తూ ఇబ్బందికి గురిచేస్తుందని ఆరోపించారు. కాగా, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి యాదమ్మను వివరణ కోరగా, ఇంటి బిల్లుల కోసం ఎవ్వరినీ ఒత్తిడి చేయలేదని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఫించన్ డబ్బులను బీపీఎం పంపిణీ చేస్తుండగా, కొంత మంది వారే అడిగి ఇంటి బిల్లు కట్టారని తెలిపారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో చదివే విద్యార్థులకు సంక్రాంతి పండుగ అనంతరం ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ మంగళవారం అన్నారు. కోచింగ్ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ విధమైన కోచింగ్ సౌకర్యాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందని అన్నారు.

చెంచులకు దుప్పట్లు పంపిణీ



అమ్రాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలానికి చెందిన శ్రీగురు కృప సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పదర మండలం ఇప్పలపల్లి, మద్దిమడుగు, బాపన్‌పాడు, ఉడిమిళ్ల, పల్లెరూట్‌పెంట గ్రామాల చెంచులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు లక్ష్మయ్య, బాలయ్య పాల్గొన్నారు.

బుడగ జంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: దళితబంధు పథకంలో బుడగ జంగాల కులానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పట్టణంలోని ఎస్సీ షాంపింగ్ కాంప్లెక్స్‌లోనూ అవకాశం కల్పించాలని బేగబుడగ జంగం అధ్యక్షుడు శ్రీనివాసులు మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకంలోనూ తమకు భాగస్వామ్యాన్ని ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, జమ్ములు, వెంకటయ్య, శివరాములు పాల్గొన్నారు.

6న సత్యనారాయణ స్వామి వ్రతాలు

కందనూలు: పుష్యమాసం పౌర్ణమి సందర్భంగా ఈనెల 6న ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కండడై వరదరాజన్ అయ్యంగార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9440981253, 9440075238 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సామాజిక సేవలకు అవార్డు



కందనూలు: జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లకు రిటైర్డ్ సీడీపీఓ సుమలావతి చేపట్టిన సామాజిక సేవలకు గాను సావిత్రి బాయి పూలే రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాల కమిటీ– 2023, బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు అందజేశారు. సుమలావతి విశేషమైన సేవలు అందించినందుకు గాను అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుమలావతి అంగన్‌వాడీ కార్యకర్తగా, సూపర్‌వైజర్‌గా, సీడీపీఓగా సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి, బాల్యవివాహాలు అరికట్టడానికి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించడానికి విశేషంగా అందించిన సేవలకు ఈ అవార్డు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మద్దతు ధర కల్పించండి

బిజినేపల్లి: పత్తి పండించే రైతులకు కనీస గిట్టుబాటు ధర రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బీఎస్పీ నాయకులు మంగళవారం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముందుగా బీఎస్పీ మండల అధ్యక్షుడు రాంచందర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం దళారులు, వ్యాపారుల వల్ల పత్తి రైతులకు జరుగుతున్న నష్టాన్ని వినతిపత్రం రూపంలో అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శివకృష్ణ, రాములు, వెంకటరమణ, బాలరాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

ఆరుగాలం కష్టపడి పత్తిని పండించిన రైతులకు కనీస ధర చెల్లించడం లేదని తిమ్మాజీపేట బీఎస్పీ నాయకులు సురేందర్, పరుశరాములు ఆరోపించారు. సోమవారం తిమ్మాజీపేట తహసీల్దారు కార్యాలయంలో పత్తి రైతులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రాజు, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



చిన్నకార్పాములలో పాదయాత్ర చేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

పెద్దకొత్తపల్లి: నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కొల్లాపూర్ ప్రగతి కోసం పాదయాత్ర మండలంలోని చిన్నకార్పాములలో చేపట్టారు. గ్రామంలో బీజేపీ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత పాలకులు అభివృద్ధిని మరిచిపోవడంతో గ్రామాల్లో సమస్యలు అలాగే ఉన్నాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి తనను ఎమ్మెల్యేగా అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అనంతరం నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భీమేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, శేఖర్‌గౌడ్, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

తెలకపల్లి: పట్టుదలతో చదివితే ఉద్యోగాలు సాధించవచ్చని ఎంపీటీసీ లక్ష్మమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిరుద్యోగ యువతకు రైటింగ్ ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, బారిగారి సురేశ్, చెన్న నర్సింహ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



వెల్దండలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



లింగాల మండలం కోమటికుంటలో చార్ట్‌ల ప్రదర్శన..

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీఈఓ గోవిందరాజులు

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీఈఓ గోవిందరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ అంశాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థులకు చదువు అందించడానికి ప్రభుత్వ టీఎల్‌ఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడానికి మన ఊరు–మన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి రెడ్డి, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, భాస్కర్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంఈఓలు శంకర్‌నాయక్, సర్దార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ అవిష్కరణ..

మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీఈఓ గోవిందరాజులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగభూషణం, రవి, రాధకృష్ణ పాల్గొన్నారు.

అలరించిన టీఎల్‌ఎం మేళా..

లింగాల: తొలిమెట్టులో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి 'బోధన అభ్యసన సామాగ్రి' (టీఎల్‌ఎం) మేళా పలువురిని అలరించింది. ఎంఈఓ చంద్రుడు, సర్పంచు కోనేటి తిర్పతయ్య, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి మేళాను ప్రారంభించారు.

మన్ననూర్: మండల స్థాయిలో సాంఘికశాస్త్రం ఫోరం టాలెంట్ టెస్ట్‌ను మన్ననూర్‌లోని ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు హెచ్‌ఎం కృష్ణయ్య తెలిపారు.

తెలకపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దపల్లి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.